సాక్షి వనపర్తి

శనివారం । 19 । ఆగస్టు । 2023



మధురస్మృతుల ప్రతిబింబం

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' దృశ్యమాలిక..

వివరాలు 8లో ►



ఫుట్‌బాల్ విజేత రంగారెడ్డి

పెబ్బేరులో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో రంగారెడ్డి రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది.

వివరాలు 8లో ►

గరిష్టం/కనిష్టం
33.9 /24.3

వాతావరణం

ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

రోగులకు మెరుగైన వైద్యసేవలు



పాన్‌గల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం సభ్యులు డా. శిరీష్‌కుమార్ నస్కార్, డా. శ్రీరామ సీజే కోరారు. రెండోరోజు శుక్రవారం బృందం సభ్యులు పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న వసతులు, నాణ్యమైన వైద్యసేవలకు ఇంకా ఏర్పాటు చేయాల్సిన వసతులపై వైద్యులతో చర్చించారు. అనంతరం బృందం సభ్యులను పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వైద్యులు ఇస్మాయిల్, రాకేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరీశ్, లావణ్య, లత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పంట రుణమాఫీ



పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.రెండు లక్షల పంట రుణమాఫీ చేస్తుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కడుకుంట్లలో గడప గడపకు యువజన కాంగ్రెస్‌యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువత బాణాసంచా కాల్చి స్వాగతం పలికారు. గ్రామంలో ఇల్లిల్లూ తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి నిరుద్యోగభృతి, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, రూ.500లకే సిలిండర్ అందిస్తామన్నారు. రైతులకు పంటల బీమా, గిట్టుబాటు ధర, నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు వివరించారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే రైతులకు మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు రవికిరణ్, నందిమళ్ల చంద్రమౌళి, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు విస్మరించిన బీఆర్‌ఎస్



వనపర్తిటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని.. మరోసారి నమ్మి ఓటేసి గెలిపిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తారని మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని 3, 4, 5, 18, 19, 20, 21వ వార్డులో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆధ్వర్యంలో వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధానకార్యదర్శి అభిలాష్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసిందే తప్పా చేసిందేమీ లేదన్నారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర నాయకుడు కమర్‌మియా, పట్టణ మాజీ అధ్యక్షుడు డి.కిరణ్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సమద్, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు, నాయకులు దివాకర్, బాబా, డి.వెంకటేష్, మన్యంకొండ, రోహిత్, జానకిరాములు, అక్షయ్, నర్సింహ, ఆసీఫ్, రాములు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో ఎస్టీ జూనియర్ కళాశాల గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఆర్సీఓ నాగార్జునరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, అచ్చంపేట, కేటీదొడ్డి, గద్వాల్, కొండాపూర్, పెద్దమందడి, మన్ననూర్ గురుకులాల్లో ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 21న ఉదయం 10 గంటలకు సంబంధిత కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

రికార్డు స్థాయిలో కిక్కు



వనపర్తిలో శుక్రవారం దరఖాస్తులు అందజేస్తున్న మద్యం వ్యాపారులు

ఖద్దర్ చొక్కాలు.. ఖరీదైన కార్లు

నూతన కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఖద్దరు చొక్కాలు ధరించిన మనుషులు విలువైన కార్లలో రావడం కనిపించింది. మద్యం టెండర్లు వేయడానికి వచ్చిన వీరితో నూతన కలెక్టరేట్ పరిసర ప్రాంతాలు కిక్కిరిశాయి. ఓ సమయంలో ఆ రోడ్డు వెంట వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

- అత్యధికంగా ఉండవెల్లి 28 దుకాణానికి 99, తక్కువగా తుర్కపల్లి 63 దుకాణానికి 10..
- మహబూబ్‌నగర్‌లో 4, 6 షాపులకు పోటాపోటీ
- ఉమ్మడి జిల్లాలో 230 వైన్స్‌లకు 8,595 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.171.90 కోట్ల ఆదాయం

మహబూబ్‌నగర్ క్రైం: రాబోయే రెండేళ్లలో వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ సారి మద్యం వ్యాపారుల మధ్య అధిక పోటీ కనిపించింది. గతంలో ఎక్సైజ్ శాఖ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన కొత్త మద్యం పాలసీలో భాగంగా దుకాణాలను దక్కించుకోవడానికి వ్యాపారులు తీవ్రంగా పోటీపడ్డారు. ఈ నెల 4 నుంచి 16 వరకు ఉమ్మడి జిల్లాలో 2,364 టెండర్లు రాగా.. గురువారం 2,333, చివరి రోజు శుక్రవారం 3,898 టెండర్లు దాఖలయ్యాయి. వీటితో ప్రభుత్వానికి రూ.77.96 కోట్ల ఆదాయం సమకూరింది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే 6,231 టెండర్లు వచ్చాయి. ఇక ఉమ్మడి జిల్లాలో 230 ఏ4 మద్యం దుకాణాలు ఉండగా.. వీటికి 8,595 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.171.90 కోట్ల ఆదాయం వచ్చింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి మద్యం దుకాణాలకు టెండర్లు పడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈసారి ఉమ్మడి జిల్లా వ్యాపారులతోపాటు ఆంధ్ర, కర్ణాటక నుంచి కూడా టెండర్లు దాఖలు చేశారు. ప్రధానంగా మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో దరఖాస్తులు రెట్టింపు అయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో మూడేళ్లు టెండర్లలో వచ్చిన దరఖాస్తులు ఇలా..

జిల్లా	2019	2021	2023
మహబూబ్‌నగర్- పేట	1,384	1,525	3,571
నాగర్‌కర్నూల్	1,064	1,507	2,524
జోగుళాంబ గద్వాల	418	987	1,171
వనపర్తి	516	694	1,329

ఎస్‌హెచ్‌ఓ	దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు
మహబూబ్‌నగర్	28	1,306
జడ్చర్ల	26	1,236
నారాయణపేట	22	573
కోస్గి	14	456
నాగర్‌కర్నూల్	18	684
కొల్లాపూర్	12	292
తెలకపల్లి	7	263
కల్వకుర్తి	17	883
అచ్చంపేట	13	402
గద్వాల	21	473
అలంపూర్	15	698
వనపర్తి	17	609
కొత్తకోట	15	546
ఆత్మకూర్	5	174

82 శాతం పెరుగుదల..

ఉమ్మడి జిల్లాలో 2021తో పోల్చితే ఈసారి వచ్చిన దరఖాస్తులు 82 శాతం పెరిగాయి. చివరిరోజు 65 శాతం టెండర్లు దాఖలయ్యాయి. ఈ నెల 4 నుంచి 18 వరకు ఉమ్మడి జిల్లాలో ఉన్న 230 మద్యం దుకాణాలకు టెండర్లు తీసుకోవడం జరిగింది. చివరిరోజు ఉమ్మడి జిల్లాలో 3,898 టెండర్లు వచ్చాయి. మహబూబ్‌నగర్‌లో 1,439, నాగర్‌కర్నూల్‌లో 1,311, గద్వాలలో 478, వనపర్తిలో 670 దరఖాస్తులు రావడం జరిగింది. 2021లో మొత్తం 230 దుకాణాలకు 4,713 టెండర్లు వస్తే.. ఈసారి 8,595 టెండర్లు రావడం గమనార్హం.

మహిళలు సైతం..

నూతన మద్యం దుకాణాల కోసం టెండర్లు వేయడానికి మహిళలు సైతం కలెక్టరేట్‌కు వచ్చారు. కొందరు వ్యక్తులు సెంటిమెంట్ కోసం భార్యలను, ఇతర కుటుంబ సభ్యులను తీసుకురాగా.. మరికొందరు మహిళలు వారి పేర్లమీద టెండర్లు వేయడానికి కార్యాలయానికి క్యూ కట్టారు.

లాటరీ పద్ధతిలో కేటాయింపు..

ఈ నెల 21న తేదీన కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా దుకాణాలు కేటాయించనున్నారు. దుకాణం నంబర్ ఆర్డర్ ప్రకారం లక్కీడిప్ కొనసాగనుంది. ఒక్కో దుకాణానికి వచ్చిన టెండర్లు అన్నింటిని ఒక బాక్సులో కలిపి వాటిలో నుంచి ఒక నంబర్ తీస్తారు. డిసెంబర్ 1 నుంచి కొత్త దుకాణాలను ప్రారంభించి మద్యం అమ్మకాలు మొదలుపెడతారు.

డిమాండ్ ఉన్నవి ఇవే..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా డిమాండ్ ఉన్నదిగా ఉండవెల్లి 28వ దుకాణం నిలిచింది. ఈ దుకాణానికి ఏకంగా 99 టెండర్లు రాగా.. ఉండవెల్లిలోని మరో దుకాణానికి 72 దరఖాస్తులు వచ్చాయి. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని 39వ దుకాణానికి 68, నారాయణపేట జిల్లాలోని కృష్ణలో 73వ దుకాణానికి 71, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి 41 దుకాణానికి 75, 44వ దుకాణానికి 75, 38వ దుకాణానికి 74 టెండర్లు వచ్చాయి. వనపర్తి జిల్లాలో అత్యధికంగా టెండర్లు మదనాపురంలోని 37వ దుకాణానికి 76 రాగా.. వీపనగండ్ల 32వ దుకాణానికి 75, పెద్దమందడి 31వ దుకాణానికి 67 దరఖాస్తులు వచ్చాయి. ఇక ఉమ్మడి జిల్లాలో అత్యల్పంగా అచ్చంపేటలోని తుర్కపల్లి 63వ దుకాణానికి 10 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

పోరాటయోధుడు పాపన్నగౌడ్



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: బహుజనుల హక్కుల సాధనకు పోరాడిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని.. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సముదాయలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నాటి పరిస్థితుల్లో బహుజనులకు జరిగిన అన్యాయాన్ని ఎదురించి న్యాయం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి పాపన్నగౌడ్ అని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వం బహుజనుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేర మొక్కలు నాటాలి..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న నిర్వహించే కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హైదరాబాద్ నుంచి ఆసరా పింఛన్లు, హరితహారం, దశాబ్ది ఉత్సవాల సంపద వనాలు, గృహలక్ష్మి, బీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయం, రెండోవిడత గొర్రెల పంపిణీ, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. ఆగస్టు 26న జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మండల కేంద్రాలు, పుర కేంద్రాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సంపద వనాలు సైతం గుర్తించిన ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. రెండోవిడత లబ్ధిదారులకు రాయితీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా మైనార్టీలకు రూ.లక్ష, బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు లబ్ధిదారులను గుర్తించి ప్రొసీడింగ్స్ ఇచ్చి త్వరలోనే యూనిట్ల గ్రౌండింగ్ చేయనున్నట్లు తెలిపారు. గృహలక్ష్మి దరఖాస్తులను గడువులోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలో కారుణ్య నియామకాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉత్తర్వులు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, డీఆర్డీఓ నర్సింహులు, పశుసంవర్ధకశాఖ అధికారి, బీసీ సంక్షేమశాఖ అధికారి, డీపీఓ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆర్డీఓ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం



అమరచింత: కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బీసీబంధు చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ బీసీబంధు, ఎస్సీలకు దళితబంధు, మైనార్టీకు మైనార్టీబంధు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో 26 మందికి పట్టణంలో 22 మందికి బీసీబంధు చెక్కులు అందించారు. ఎంపీపీ డా. చుక్కా మాలతి, జెడ్పీటీసీ సభ్యురాలు మార్క సరోజ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, ఎంపీడీఓ జ్యోతి, పుర కమిషనర్ మహ్మద్ ఖాజా, బీఆర్‌ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్, అక్కల నర్సింహులుగౌడ్, బాలరాజు, కమలాకర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షం..

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని.. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 55 మంది లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులు అందజేసి మాట్లాడారు. కులవృత్తులను నమ్ముకొన్న వారికి రూ.లక్ష సాయం అందించి కొండంత అండగా నిలుస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడించి ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రవియాదవ్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారు శ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, వైస్ ఎంపీపీ కోటేష్ పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్ ప్రహరీ ప్రారంభం..

మండలంలోని బాలకిష్టాపూర్‌లో రూ.6 లక్షలతో నిర్మించిన ముస్లిం మైనార్టీల ఖబ్రస్తాన్ ప్రహరీని శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ తుకారాంనాయక్, ఉపసర్పంచ్ ఖాసింబీ, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికిగాను మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ బక్కన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోపాలో 31, ఎలక్ట్రీషన్‌లో 5, ఫిట్టర్‌లో 12, సివిల్‌లో 11 మొత్తం 59 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. శనివారం నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని.. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్ 9849643932 సంప్రదించాలన్నారు.

ఆ ఒక్క సీటుపై సస్పెన్స్..!

బీఆర్‌ఎస్‌లో టికెట్ల టెన్షన్.. కల్వకుర్తిపైనే ఉత్కంఠ

- ప్రస్తుతానికి పెండింగ్ పెట్టిన అధిష్టానం
- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డికి సంకేతాలు?
- రాష్ట్రంలో సామాజిక సర్దుబాటు తర్వాత వెల్లడించే అవకాశం
- అచ్చంపేట, అలంపూర్‌తో సహా మిగతా అన్ని సెగ్మెంట్లలో సిట్టింగ్‌లకే చాన్స్



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: భారత రాష్ట్ర సమితిలో ఎమ్మెల్యే అభ్యర్థిత్వాలపై ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ నెల 21న బీఆర్‌ఎస్ జాబితాను ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతుండగా.. పాలమూరు జిల్లాల్లో ఎవరెవరికి చోటు దక్కుతుందనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది. సిట్టింగ్ అభ్యర్థులకే సీట్లు అని సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటికీ.. పలు దఫాలుగా చేపట్టిన సర్వేల్లో తేలిన ప్రకారం టికెట్ల కేటాయింపులు ఉంటాయనేది తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో విజయంతో హ్యాట్రిక్ సాధించడమే లక్ష్యంగా గెలుపు గుర్రాలను బరిలో నిలిపేందుకు కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. గతంలో లాగే అన్ని రాజకీయ పార్టీల కంటే ముందుగా అభ్యర్థులను ప్రకటించేలా అన్ని రకాల కసరత్తులు పూర్తి చేశారు. మరో రెండురోజుల్లో జాబితా వెలువడనుండగా.. ఉమ్మడి జిల్లాలో కల్వకుర్తి సీటుపై సస్పెన్స్ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇది మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే సీట్లు ఖరారైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

పెండింగ్‌లో కల్వకుర్తి..

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఇద్దరు బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పటికీ.. గ్రూప్ రాజకీయాలతో పార్టీ కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. గత ఎన్నికల్లో కసిరెడ్డి ఎమ్మెల్యే టికెట్ ఆశించినా.. జైపాల్‌యాదవ్‌కే అవకాశం దక్కింది. అయితే ఈసారి తాను తప్పక బరిలో ఉంటానని, తనకే టికెట్ వస్తుందని కసిరెడ్డి ధీమా వ్యక్తం చేస్తుండడంతో పాటు ఇది వరకే ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఎవరికి సీటు ఇచ్చినా ఇంకొకరు ఎలా స్పందిస్తారో తెలియని అయోమయం పార్టీలో నెలకొంది. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం ఎవరికి సీటు ఇస్తే గెలుపొందుతారని సర్వే చేయించినట్లు తెలిసింది. అంతేకాకుండా నియోజకవర్గంలో జైపాల్‌యాదవ్ పనితీరుపైనా సర్వే చేసినట్లు సమాచారం. ఫలితాలు యాదవ్‌కు వ్యతిరేకంగా ఉండగా.. పార్టీ అధిష్టానం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది.

ఒకే ఒక్క బీసీ ఎమ్మెల్యే..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో రెండు (అచ్చంపేట, అలంపూర్) ఎస్సీ రిజర్వ్ కాగా.. మిగతా ఐదు (నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, గద్వాల, వనపర్తి) జనరల్ స్థానాలు. ఈ ఐదు జనరల్ స్థానాల్లో నలుగురు రెడ్డివర్గానికి చెందిన వారు కాగా.. జైపాల్‌యాదవ్ బీసీ వర్గానికి చెందిన వారు. దీంతో పార్టీ అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సామాజిక సర్దుబాటు తర్వాత కల్వకుర్తి అభ్యర్థిని ఖరారు చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే సీటు ఖరారుపై ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి సంకేతాలు అందాయనే ప్రచారం పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఆ సంకేతాలు 'వేచి చూడమని చెప్పినట్లా.. లేక మీరే అభ్యర్థి, నియోజకవర్గంలో పని చేసుకోండి' అని చెప్పారా అనే దానిపై స్పష్టత లేదు.

ఊగిసలాట.. అయినా ఖరారు

అచ్చంపేట, అలంపూర్ అభ్యర్థిత్వాలపై ఊగిసలాట కొనసాగినా.. సిట్టింగ్‌లకే ఖరారు చేసినట్లు సమాచారం. ఈ రెండు స్థానాల్లో నిర్వహించిన సర్వేల్లో ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నా.. పార్టీ పట్ల సంతృప్తికర ఫలితాలే వచ్చినట్లు తెలుస్తోంది. అలంపూర్‌లో అబ్రహం, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మధ్య విభేదాలు ప్రభావం చూపే అవకాశం ఉందని గ్రహించిన అధిష్టానం ఇది వరకే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అలంపూర్‌తో పాటు కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యతను చల్లాకు కట్టబెట్టినట్లు పార్టీ అధిష్టాన వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు అచ్చంపేట నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎంపీ రాములు తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరినట్లు వినికిడి. ఈ సమయంలో వారసులకు ఇచ్చే అవకాశం లేదని.. వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత సముచిత స్థానం కల్పిస్తామని పెద్దలు చెప్పినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇరువురిని సమన్వయం చేసే బాధ్యతలను ఇద్దరికి పరిచయమున్న ఓ ముఖ్య నాయకుడికి అప్పజెప్పినట్లు సమాచారం. ఆ తర్వాతే ఎమ్మెల్యే గువ్వల, ఎంపీ రాములు.. పార్టీ నుంచి ఎవరికి టికెట్ వచ్చినా.. ఇరువురం సహకరించుకుని, పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటామని చెబుతున్నట్లు వారివారి అనుచర వర్గాల్లో చర్చ జరుగుతోంది.

భవిష్యత్‌లో విద్యా రాజధానిగా వనపర్తి



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అన్ని విద్యాలయాలు వనపర్తిలో ఉండేలా కృషి చేస్తున్నామని.. భవిష్యత్‌లో విద్యా రాజధానిగా వనపర్తి మారబోతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి, యువజన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో కేవలం ఐదు వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని.. అందులో మూడు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంలో జిల్లాకు ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. అమెరికా అధ్యక్షులుగా ఎన్నికైన వారు అత్యధికులు హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నవారేనని.. ఒకప్పుడు చదువుకోవడానికి ఎలాంటి వసతులు ఉండేవి కావన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విద్యార్థులు, యువత ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాల్లో నిలబడుతున్నారని తెలిపారు. వ్యవసాయరంగం బలోపేతం చేయడంతో ఆ రంగంలో ఉపయోగించే ఎరువులు, యంత్రాలు, ఇంధన పరిశ్రమలు, అక్కడ పండే పంటలు, ఆ పంటల కోసం ఏర్పాటు చేసే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వంటి వాటితో లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని వివరించారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ప్రముఖ కవి కోటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, విజయ్, కురుమూర్తియాదవ్, ప్రమోద్‌రెడ్డి, రాములుయాదవ్, మారెడ్డి నరేష్‌రెడ్డి, భాగ్యరాజ్, హేమంత్, శ్రావణ్‌కుమార్, గిరి, గంగప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులు ఉంది. జూరాల ఎడమ కాల్వ నుంచి 870, సమాంతర కాల్వ నుంచి 850 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 950, కుడి, ఎడమ కాల్వలకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2కు 851, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


కుర్వ గోపాల్

ధరూరు: గొర్రెలు కాయడానికి వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలోని మన్నాపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ గోపాల్ ఈ నెల 12న రాత్రి చింతరేవుల గ్రామానికి చెందిన కుర్వ రంగన్న గొర్రెలు మేపేందుకని ఇంట్లో చెప్పి వెళ్లి వెళ్లాడు. మరుసటి రోజు అతని భార్య మహేశ్వరి రైతు రంగన్నకు ఫోన్ చేసి అడగ్గా, రాలేదని సమాధానమిచ్చాడు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం గౌడ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 70293 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి


బంగారయ్య (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఆటోను ఢీకొనడంతో బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. తాడూరు మండలం అల్లాపూర్ చెందిన సాంబశివుడు తన ఆటోలో ప్రయాణికులతో వెళ్తుండగా ఎండబెట్ల సమీపంలో ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చిన పాన్‌గల్ మండలం గోప్లాపూర్ చెందిన మిద్దె రాజబాబు ఆటోను ఢీకొట్టాడు. ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో ఉన్న గుంతకోడూరు చెందిన బంగారయ్య (45)తలకు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతమ్మ, లక్ష్మమ్మకు గాయాలు కాగా వీరిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. బంగారయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

అమరచింత: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు కొండన్న (40) కొంతకాలంగా భార్యభర్తలు తరుచూ గొడవ పడేవారు. ఈక్రమంలో భార్య మణెమ్మ తన పుట్టినిల్లయిన నందిమళ్లకు వెళ్లింది. భార్యను రమ్మని పలుమార్లు కోరగా, రాకపోవడంతో మానసికంగా బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకోగా, గమనించిన కుటుంబసభ్యులు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

పుల్లూరు టోల్ సిబ్బందిపై కేసు నమోదు

ఉండవెల్లి: డ్రైవర్‌పై దాడి చేసిన టోల్‌ప్లాజా సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు శుక్రవారం తెలిపారు. మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్దనీ నెల 16వ తేదీన అనంతపురం జిల్లాకు చెందిన జగదీశ్ నాయక్ బొలెరో వాహనంలో టమాట లోడ్‌ను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లి, తిరిగి వెళ్లే క్రమంలో టోల్‌ప్లాజా వద్ద వాహనాలు అధికంగా ఉండడంతో హరన్ కొట్టాడు. దీంతో టోల్ సిబ్బంది ప్రశ్నించగా మాటామాటా పెరగి వాగ్వాదానికి దిగారు. వాహనంలో వెళ్తుండగా జగదీశ్‌నాయక్‌పై కొందరు టోల్‌ప్లాజా సిబ్బంది 10 మంది దాడి చేశారు. నారాయణ, దేవన్న, సంపత్, రాజశేఖర్లను గుర్తించి వారిపై శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మైనర్‌పై కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని బాలుడు మోసం చేసి గర్భిణిని చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వనపర్తి సీఐ మహేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రేవల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన బాలుడు పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. దీంతో ఆ బాలిక నమ్మి ప్రస్తుతం ఏడు నెలల గర్భిణీగా ఉంది. ఇప్పుడు పెళ్లి చేసుకోనని, తనకు సంబంధం లేదని మొండికేయడంతో బాలిక కుటుంబ సభ్యులు రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పొలంలో చిన్నారుల ఆట, పాట, జడ్చర్ల హౌసింగ్‌బోర్డు గుట్ట వద్ద నెమళ్ల సందడి


మధురస్మృతుల ప్రతిబింబం


బోనంతో సెల్ఫీ తీసుకుంటున్న యువతి


కొత్తకోట మండలం పామాపురం చెరువులో శివయ్య

ఒక్క ఫొటో.. లక్ష మెదళ్లను కదిలిస్తుంది.. కోటి అక్షరాలలో చెప్పలేని భావాన్ని చూపిస్తుంది. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం, ఓ కథ, ఓ అనుభూతి దాగుంటుంది. కరిగిపోతున్న మన జీవనచక్రంలో చెదరని మధుర స్మృతులకు ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి. అలనాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేస్తున్నాయి. వినోద, విజ్ఞాన, విషాదం..ఇలా ప్రతి విషయంలో ఫొటోగ్రఫీ ఓ భాగమైపోయింది. రెప్పపాటు కాలంలో మాయమయ్యే దృశ్యాలను కెమెరాలో బంధించి.. కలకాలం పదిలంగా ఉంచుకుంటున్నాం. బ్లాక్ అండ్ వైట్ నుంచి కాలక్రమేనా ఎన్నో మార్పులు చోటు చేసుకొని ప్రస్తుతం డిజిటల్ ఫొటోగ్రఫీ వరకు వచ్చింది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 'సాక్షి' కెమెరాకు చిక్కిన అందమైన దృశ్యాలివి...

– సాక్షి, సీనియర్ ఫొటోగ్రాఫర్


బీచుపల్లి కృష్ణానదిలో సాయంకాలం సంధ్యావేళల్లో


చేపల వేట కోసం పడవపై వెళుతున్న దృశ్యం


పొలం గట్టుపై నుంచి బతుకమ్మలతో మహిళలు




మల్లికార్జున్‌చౌరస్తా వద్ద లైట్ వెలుగుల్లో చాయ్ కప్


పొలం గట్టు వద్ద భోజనం చేస్తున్న రైతు


కురుమూర్తిస్వామి దేవాలయం


చేపల కోసం ఎదురుచూస్తున్న కొంగ


చాంపియన్‌గా నిలిచిన రంగారెడ్డి


రంగారెడ్డి టీంకు నగదు, షీల్డ్ ఇస్తున్న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

- ముగిసిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు
- రన్నరప్‌గా ఖమ్మం, మూడోస్థానంలో వనపర్తి

పెబ్బేరు రూరల్: పట్టణంలోని పీజేఈప క్యాంపులో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో సెమిఫైనల్‌కు వనపర్తి, ఖమ్మం, రంగారెడ్డి, మెదక్ ఎంపిక కావడంతో, మొదట సెమిఫైనల్ మ్యాచ్ వనపర్తి జిల్లా జట్టుపై రంగారెడ్డి జిల్లా 1–0గోల్‌తో గెలుపొందింది. రెండోది మెదక్ జిల్లా జట్టుపై ఖమ్మం జిల్లా జట్టు 2–0 గోల్స్‌తో గెలుపొందింది. ఫైనల్ మ్యాచ్ ఖమ్మం జిల్లా జట్టుపై రంగారెడ్డి జిల్లా జట్టు 3–0 గోల్స్‌తో గెలుపొంది ప్రథమ స్థానంలో నలిచింది. ప్రథమ స్థానం రంగారెడ్డి జట్టు, ద్వితీయ స్థానం ఖమ్మం, తృతీయ స్థానం వనపర్తి, మెదక్ జిల్లా జట్లు నిలిచాయి. వీరికి రూ.50వేలు నగదు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ, కృష్ణ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, సత్య శీలారెడ్డి, అప్సర్, తిరుపతి, పీఈటీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదల సంక్షేమం


స్థానికులతో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని అంబేద్కర్‌కాలనీ, రంగదాసువీధి, రాజవీధిలో పర్యటించారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. రైతులకు మొదటగా ఉచిత విద్యుత్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని వివరించారు. గతంలో చేసిన విద్యుత్ పోరాటాలు, అభివృద్ధి అంశాలను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి వెల్లడించారు. కార్యక్రమంలో మేకల నాగరాజు, వంగ రాజశేఖర్‌గౌడ్, కిరణ్‌తేజగౌడ్, కృష్ణమనాయుడు, రెడ్డి సత్యం, ఖాదర్‌పాష న్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు


భాస్కర ఆచారి

పాలమూరు: తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలలో మహబూబ్‌నగర్ 'సాక్షి' దినపత్రిక సీనియర్ ఫొటోగ్రాఫర్ వి.భాస్కర ఆచారికి రాష్ట్రస్థాయిలో ప్రోత్సాహక బహుమతి వచ్చింది. బహుమతిని ఈనెల 20న హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా అందుకోనున్నారు. 2022లో కూడా ప్రోత్సాహక బహుమతి లభించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించిన భాస్కరఆచారిని జిల్లా జర్నలిస్టులు, ఫొటోజర్నలిస్టులు అభినందించారు.

ఎస్సీ ధ్రువపత్రాల కోసం పాదయాత్ర

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి జిల్లాలో ఉన్న మదాసి, మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువపత్రాలు జారీ చేయాలనే డిమాండ్‌తో ఈనెల 20వ తేదీన అలంపూర్‌లోని జోగుళాంబ దేవాలయం నుంచి గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు మహా పాదయాత్ర చేస్తామని మదాసి, మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధన్వాడ రాములు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 ఎన్నికల సమయంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రచారం చేస్తున్నప్పుడు కురువలకు కుల ధ్రువపత్రాలు ఇస్తామని హామీ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. షెడ్యూల్డ్ కులాల జాబితా గెజిట్‌లో సీరియల్ నంబర్ 30 మదాసి కురువ, మదారి కురువ ఉందని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. జగదీష్, రాధాకృష్ణ, సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్‌జాం

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడవద్ద జాతీయరహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ట్రాఫిక్ జాం కావడంతో సుమారు ఐదారు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పనులు చేస్తుండటంతో ట్రాఫిక్‌ను ఒకే వరుసలో మళ్లించడంతో సమస్య ఏర్పడుతోంది. చివరకు రాజాపూర్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



టూడే లీగ్‌లో 'పాలమూరు' విజయం

- రాణించిన అబ్దుల్ రాఫే, డేవిడ్ క్రిపాల్
- క్రీడాకారులను అభినందించిన ఎండీసీఏ


జిల్లా క్రికెట్‌జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా తదితరులు


అబ్దుల్ రాఫే


డేవిడ్ క్రిపాల్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో నిర్వహించిన హెచ్‌సీఏ బీ–డివిజన్ టూడే లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు విజయాన్ని సాధించింది. 4 వికెట్ల తేడాతో నల్లగొండ జిల్లా జట్టుపై విజయం సాధించింది. తొలి రోజు నల్లగొండ జిల్లా జట్టు 75 ఓవర్లలో 261 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 72 పరుగులు చేసిన జిల్లా జట్టు రెండో రోజు శుక్రవారం మెరుగ్గా ఆడింది. 67.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసి విజయం సాధించింది. జిల్లా జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే బ్యాటింగ్‌లో రాణించాడు. 172 బంతుల్లో 12 ఫోర్లతో 83 పరుగులు చేయగా డేవిడ్ క్రిపాల్ 71 బంతుల్లో 7 ఫోర్లు 2 సిక్స్‌లు కొట్టి 75 పరుగులు చేశారు.

ఎండీసీఏ అభినందనలు

హెచ్‌సీఏ టూడే లీగ్ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు. ఉమ్మడి జిల్లా జట్టు గెలుపొందడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో టూడే లీగ్‌లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు కోచ్ అబ్దుల్లా ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలలో తీరిన నీటి సమస్య

సాక్షి ఎఫెక్ట్..


పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

గండీడ్: మండలంలోని వెన్నాచేడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్య తీరింది. నెల రోజులకు పైగా మోటారు కాలిపోవడంతో బయటి నుంచి అవసరమైన నీటిని కొనుగోలు చేసేశారు. గురువారం వంట ఏజెన్సీ వారు నీళ్ల ఉంటేనే వంటలు చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. దీంతో మల్‌రెడ్డిపల్లి, గోవింద్‌పల్లి, జానంపల్లి, వెన్నాచేడ్ చెందిన విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేకపోవడంతో ఆకలితో ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయాన్ని 'సాక్షి' దినపత్రిక వెలుగులోకి తీసుకవచ్చింది. 'మధాహ్న భోజనానికి ఎగనామం' శీర్షికతో శుక్రవారం కథనం రావడంతో సర్పంచ్ పుల్లారెడ్డి స్పందించారు. పాఠశాలకు వెళ్లి సమస్యపై ఆరా తీశారు. బోరు మోటారు కొత్తది తెచ్చినా బిగించేందుకు ఎవరూ రావడం లేదని ఉపాధ్యాయులు చెప్పడంతో వెంటనే సిబ్బందిని పంపించారు. వారి సాయంతో మోటారు బిగించడంతో నీటి సమస్య తీరింది. మండల విద్యాధికారి వెంకటయ్య పాఠశాలను సందర్శించి పరిస్థితులు సమీక్షించారు. ఇంకోసారి భోజనం పెట్టకుండా ఇబ్బంది పెడితే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాలలో సమస్యలు రాకుండా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌కు సూచించారు.

వన్యప్రాణి కేసులో శిక్షలు పెంచాలి


కోర్టు కేసుల గురించి వివరిస్తున్న రిటైర్డ్ డీసీఎఫ్ రామకృష్ణ

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా కోర్టు కేసుల్లో నమోదు చేసే శిక్ష రేటును పెంచే విధంగా నిబద్ధతతో పని చేయాలని అటవీశాఖ రిటైర్డ్ డీసీఎఫ్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర అటవీశాఖ అకాడమి సెఫ్నరీ దూలపల్లి ఆధ్వర్యంలో వనమాలికా ప్రాంగణంలో వన్యప్రాణుల సంరక్షణ చర్యల్లో భాగంగా నమోదు చేయాల్సిన కోర్టు కేసులపై శిక్షణ ఇచ్చారు. నిబంధనలకు లోబడి చట్టాలను ఉపయోగించుకుంటూ శిక్షలు అమలయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టంలోని ఆర్టికల్ 29ని వాడుకోకుండానే ఫిర్యాదు సేకరించాలన్నారు. ఇలాంటి చట్టాలను తెలుసుకోవాలంటే అటవీ శాఖకు సంబంధించిన సీఆర్‌పీ–50 సెక్షన్ పూర్తిగా చదివితే అర్థం అవుతుందని అన్నారు. రాష్ట్రంలోని 6–7 జోన్లకు వికారబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్‌కు చెందిన ఎఫ్ఆర్ఓ, డీఆర్ఓ, ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బీఓలు 64 మంది శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎఫ్ఓ రవీందర్, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

విదేశీ చదువులకు ఎంపికైన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న కార్యదర్శి షఫీవుల్లా, చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలుర–3 గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు విదేశీ చదువులకు ఎంపికై సత్తాచాటారు. విద్యార్థులు సయ్యద్ అయాన్‌అలీ, ఎండీ.అబ్దుల్ ఖయ్యూం బాలుర–3 టీఎంఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్నారు. అనంతరం వీరు ఉన్నత చదువుల కోసం టిమిరిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కోచింగ్ తీసుకొని ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టం (ఐఈఎల్‌టీఎస్) పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి ఇటలీ దేశంలోని మిలాన్‌లోగల డెల్‌మార్ఫ్ యూనివర్సిటీలో బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ డిజిటల్ ఎకనామిక్స్ కామర్స్ కోర్సులో సీట్లు సంపాదించారు. విదేశీ ఉన్నత చదువులకు ఎంపికైన విద్యార్థులను గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర మైనార్టీ గురుకులాల కార్యదర్శి షఫీవుల్లా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, అకాడమిక్ హెడ్ ఎంఏ.లతీఫ్, ఒకేషనల్ స్టేట్ హెడ్ ఎండీ సుభాన్ అభినందించి సన్మానం చేశారు. గురుకులాల విద్యార్థులు విదేశీ చదువులకు ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గురుకులాల మహబూబ్‌నగర్ రీజినల్ కోఆర్డినేటర్ ఖాజా బావుద్దీన్, విజిలెన్స్ అధికారులు జమీర్ ఖాన్, మహమూద్ ఆలం ఖాన్, అకాడమిక్ కోఆర్డినేటర్ సలీం తదితరులు పాల్గొన్నారు.


వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటా..

- కార్యకర్తల అభిప్రాయం మేరకు నియోజకర్గం ఎంపిక
- మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి


మక్తల్‌లో దయాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీతాదయాకర్‌రెడ్డి, నాయకులు

మక్తల్: రానున్న అసెంబ్లీల్లో ఎన్నికల్లో తాను ఖచ్చితంగా బరిలో ఉంటానని మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దివంగత మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి జయంతి సందర్భంగా పడమటి ఆంజయనేస్వామి ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు.. నియోజకవర్గానికి దయాకర్‌రెడ్డి ఎంతో సేవ చేశారన్నారు. తాను టీడీపీకి రాజీనామ చేశానని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల అభిప్రాయం మేరకు నియోజకవర్గం ఎంపిక చేసుకుని పోటీ చేస్తానన్నారు. తమ కుటుంబంపై నమ్మకంతో వెంట ఉన్న అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిదార్థరెడ్డి, కార్తీక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మణెమ్మ, రవీందర్, రమేష్, నరేష్, రాములు, రాఘవరావు చౌదరి, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులకు వీడియోకాల్ చేసి.. రైలు కిందకు దూకిన యువకుడు


రమేష్ (ఫైల్)

ఉండవెల్లి: స్నేహితులకు వీడియోకాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి రైలు కిందకు యువకుడు దూకి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్లూరుకు చెందిన లక్ష్మీదేవి, మసీశ్వర్ దంపతుల మూడవ కుమారుడు రమేష్ (20) ఇంటర్ వరకు చదివి రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాడు. శుక్రవారం జాతీయరహదారి వద్ద ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి సమీపానికి రమేష్ చేరుకున్నాడు. తన స్నేహితులు చరణ్, బబ్లూకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. అప్పుడే వచ్చిన గుంతకల్ ప్యాసింజర్ రైలు కింద దూకాడు. అతని చెయ్యి, కాలు వేరుకావడంతో కొనప్రాణంతో ఉన్న అతన్ని స్థానికులు కర్నూల్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో పుల్లూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

తండ్రిని చంపిన కుమారుడికి రిమాండ్

బిజినేపల్లి: తండ్రి వద్ద ఉన్న డబ్బులు కాజేయాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 11న తండ్రి బాలయ్యను హతమార్చిన కుమారుడు శివకుమార్‌ను శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రాములు తెలిపారు. బాలయ్యను ఇటుకతో తలపై కొట్టడంతో మరణించాడని భార్య వీరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి రిమాండ్

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లిలో భార్యభర్తలు పిట్టల తిరప్పతయ్య, లక్ష్మి గొడవపడ్డారు. ఇందులో వీరిద్దరు గాయపడ్డారు. ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేయగా, శుక్రవారం వారిని అదుపులోకి తీసుకుని వనపర్తి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి వారిద్దరికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.